ఈవారం కథ

# మరో మజిలీ

'ధనిష్ఠ'

గత కాలపు వైభవాలు సింహావలోకనం చేసుకుంటూ, వర్తమాన విషాద పరిస్థితుల్ని సమీక్షించుకుంటూ, ప్రయాణం సాగిస్తోన్న అరవై ఆరేళ్ళ ముకుందం, చిన్న కుదుపుతో, రైలు ఆగిపోవడంతో, బాహ్య ప్రపంచంలోకి వచ్చాడు.

"బాబూ... ఇది గోదావరి స్టేషన్ అనుకుంటాను" ప్రక్కనే కూర్చున్న ప్రయాణీకుడ్ని అడిగాడు ముకుందం.

"అనుకోవటం ఏమిటండి బాబూ! ఇది గోదావరి స్టేషనే!" ముకుందం వైపు విచిత్రంగా చూసి అన్నాడు ఆసామి.

ముకుందంగారు ఆయాసపడుతూనే, బ్రీఫ్‌కేసు తీసుకొని, ఆత్రుతంగా ట్రయిన్‌లో నుండి దిగుతాడు. గత పదిహేను సంవత్సరాలుగా అతడి వెన్నుతట్టి, వెంటాడుతూ, పీడిస్తోన్న ఉబ్బసం, రక్తపోటు వ్యాధులు, నాలుగడుగులు నడిస్తే, విపరీతమైన ఆయాసం, ఆయనకు రావటం అలవాటయింది. క్షణకాలం పరిసరాలు క్షుణ్ణంగా, పరిశీలించి చూడగా, ప్లాట్‌ఫాంలో ప్రయాణీకులు కూర్చునే బెంచీని చూసిన ముకుందం, బ్రతుకు జీవుడా అనుకుంటూ, నీరసంగా అడుగులు వేసి, బెంచివద్దకు చేరుకుని, భారంగా ఊపిరి పీల్చుకుని కూర్చున్నాడు. తనకు తెలిసిన వారెవరయినా, తటస్థపడతారేమోనని, మొహం దాచుకునే ప్రయత్నంగా జేబురుమాలు తీసుకొని, మొహానికి అడ్డం పెట్టుకుని స్వేద బిందువులు తుడుచుకుంటున్నట్లుగా మొహాన్ని తుడుచుకుంటూ, ఆదరాబాదరగా స్టేషన్‌లో నుండి బయటకు వెడుతున్న ప్రయాణీకుల్ని గమనిస్తున్నాడు ముకుందం.

మరికొద్దిసేపటికి రైల్వే గార్డు విజిల్ ఊదటంతో, సర్కార్ ఎక్స్‌ప్రెస్ గర్భిణీ స్త్రీలా, తాబేటి నడకతో కదులుతుంది.

తన తరువాత కార్యక్రమం గురించి ఆలోచిస్తుంటాడు ముకుందం. కానీ అంతుచిక్కని పరిష్కారమే మిగులుతుంది. ఇంతలో టిక్కెట్ కలెక్టర్ తన ఛాంబర్‌కు వెడుతూ, ముకుందాన్ని చూశాడు. ఆయన వాలకం టిక్కెట్‌లేని బాపతుగా, ఊహించుకుని కనీసం చిల్లర డబ్బులైనా, గుంజుకోవచ్చునని, హుషారుగా ముకుందం వద్దకు వచ్చి టికెట్ అడిగాడు. ముకుందం తాపీగా జేబులో చేయిపెట్టి, టికెట్ కోసం వెతికాడు. లేకపోవడంతో మరొక జేబులో ప్రయత్నించాడు. ఆలస్యాన్ని సహించలేని టికెట్ కలెక్టర్, తన ఎక్స్‌రే కళ్ళతో ముకుందం దుస్థితిని గుర్తించి, అసహనంగా అన్నాడు.

"అసలు టికెట్ వుంటే కదయ్యా వెతకడానికి? వయసు, వేషం చూస్తాంటే స్వాతంత్ర్య సమరయోధుడివిలా వున్నావ్? చాల్లేవయ్యా యాక్షన్... పద పద... నూట యాభైరూపాయలు జుల్మానా కట్టాలి ! లేదంటే జైల్లో కూర్చోవాలి! ఆలోచించుకో!! లేదంటావా ఒక యాభై రూపాయలు ఇచ్చేయ్... వదిలేస్తాను". ఈ ప్రహసనాన్ని అక్కడున్న లైసెన్స్ కూలీలు వగయిరా ఉత్కంఠ భరితంగా పరికిస్తున్నారు.

ఈ పరిస్థితులు ముకుందానికి తల కొట్టేసినట్టయింది. మరింత టెన్షన్‌కు గురయిన ముకుందం చాలా ఆత్రుతగా బ్రీఫ్‌కేసు తెరిచి, బట్టల అడుగున వున్న మనీ పర్సు తీసి, టికెట్ కోసం వెతుకుతున్నాడు. పర్సులోని అరలో టికెట్ పదిలంగా వుండటంతో బరువుగా నిట్టూర్చి, ఆ టికెట్ తీసి టి.సి.కి యిస్తాడు. టికెట్ చూసిన టికెట్ కలెక్టర్ మొహం మాడిపోతుంది. ఇదొక వినోదంగా అప్పటివరకు చూసిన జనాల కళ్ళల్లో ఆశ్చర్యం వ్యక్తమవుతుంది. మానసికంగా తనకు జరిగిన అవమానానికి హృదయం గాయపడుతుంది. ఈ ప్రభావం మస్తిష్కానికి పదునెక్కి, ఆవేశానికి గురయినందున తనకున్న ఆయాసం, రక్తపోటు ఏకమయి, ఉవ్వెత్తుగా విజృంభిస్తాయి. ఆవేశాన్ని అదుపు చేసుకున్నట్టుగా ముకుందం ప్రశాంత వదనంతో టి.సి.తో అంటాడు.

"నీవు మెట్రిక్‌లేటివో, గ్రాడ్యుయేటివో తెలీదు గానీ, సభ్యత – సంస్కారం పట్ల నీకు నదవగాహన లేదనుకుంటాను బాబూ...! పదవీ దురహంకారం, అక్రమ ధనార్జనా దాహం రైల్వే శాఖ నుంచి నీకు వారసత్వంగా వచ్చిందనుకుంటాను. టికెట్ అడగటం నీ డ్యూటీ ధర్మం! కానీ అడిగే విధానం యిది కాదు. వయసులో పెద్దవాడ్ని... జ్ఞాపక శక్తి క్షీణించిన వాడ్ని... పైగా రోగపీడితుడ్ని... నేను టికెట్ చూపించడంలో ఆలస్యం కావచ్చు. అంతమాత్రంతోనే నన్ను టికెట్ లెస్ గాడ్నిగా దెప్పిపొడవటం సంస్కారమనిపించుకుంటుందా బాబూ...!" ఆయాసంతో రొప్పుతూ అంటాడు ముకుందం. అప్పటికే టికెట్ కలెక్టర్ సిగ్గుతో కుంచించుకు పోతాడు.

"అయామ్ వెరీ వెరీ సారీ సార్! క్షమించండి!!" అనంటూ ముకుందం రెండు చేతులు పట్టుకుంటాడు టికెట్ కలెక్టర్. అతని రెండు చేతులలో నుంచి తన చేతులు విడదీసుకుని, బాధాతప్త స్వరంతో అంటాడు ముకుందం.

"నాకు ఊహ తెలిసేటప్పటికి, యీ దేశం బ్రిటిష్ వారి పాలనలో మూడు పువ్వులూ, ఆరు కాయలుగా ప్రశాంతంగా, పవిత్రంగా, నీతి నిజాయితీలతో విలసిల్లింది. ఆనాడు వారు నిర్మించిన ఆనకట్టలు, వంతెనలు, చరిత్రాత్మకమయిన భవంతులు యిప్పటికీ చెక్కుచెదరకుండా గట్టిగా నిలబడి వున్నాయి. వారి నిష్క్రమణతో సత్ప్రమాణాలకు కాలం చెల్లింది. సమస్త విలువలు హరించుకుపోయి లంచగొండితనం, ఆశ్రిత పక్షపాతం వర్తమాన ప్రజాస్వామ్య

భారత ప్రభుత్వంలో చోటుచేసుకున్నాయి. అమాయకులైన ఓటర్లను మభ్యపెట్టి అధికారాన్ని హస్తగతం చేసుకుని గత యాభై సంవత్సరాలుగా ప్రజానాయకులు వేలాది కోట్ల రూపాయలు స్వాహాచేసి, యీ దేశాన్ని అంతర్జాతీయ స్థాయిలో అథమ స్థానంలోకి దిగజార్చారు. నిష్టుర సత్యవాక్కులు బాధాకరంగా వుండవచ్చు. కానీ జరుగుతోన్న వాస్తవిక చరిత్ర అదే బాబూ...! నీ తప్పేం లేదు. అవినీతి ప్రభుత్వ వ్యవస్థలో నీవూ భాగస్వామివే కాబట్టి అలా ప్రవర్తించావ్!!

"క్షమించండి! పెద్దలు మీరు. మీ మనసు కష్టపెట్టినందుకు సిగ్గుపడుతున్నాను. తమకు అభ్యంతరం లేకపోతే మీరు ఎక్కడకు వెళ్లేది చెబితే రిక్షా ఏర్పాటు చేస్తాను" వినమ్రంగా టి.సి. ముకుందం కళ్లల్లోకి చూసి అంటాడు. టి.సి. పశ్చాత్తాప స్వరానికి స్పందించిన ముకుందం చిరునవ్వుతో టి.సి.ని చూస్తూ అంటాడు.

"చాలా ధన్యవాదాలు బాబూ...! నేను ఎలాగో వెళ్లగలనులే!! నీకెందుకు శ్రమ?"

"ఇందులో శ్రమేం లేదండి. మీ ఆరోగ్యం బాగున్నట్టు లేదు. లేవండి!!" అనంటూ ఆయన్ని లేపి, ఆయన చేతిలోని బ్రీఫ్‌కేసు తీసుకుని, స్టేషన్ బయటకు తీసుకువెడతాడు టికెట్ కలెక్టర్.

అక్కడ రిక్షావాళ్లు ఈగలు వాలినట్టు మూగారు. తెలిసిన రిక్షా ఆసామీని పిలిచి చెబుతాడు టికెట్ కలెక్టర్.

"ఈ బాబుగారు ఎక్కడకు తీసుకువెళ్లమని చెబితే అక్కడకు జాగ్రత్తగా తీసుకువెళ్లు. వారు డబ్బులిచ్చినా తీసుకోవద్దు. నేనిస్తాను" అనంటూ ముకుందాన్ని జాగ్రత్తగా రిక్షాలో కూర్చుండబెట్టి వీడ్కోలు చెప్పిన టి.సి. చర్యకు ముకుందం చాలా ముగ్ధుడయ్యాడు. రిక్షా అక్కడ నుంచి కదలడంతో టి.సి. కూడా స్టేషన్‌లోకి వెళ్లి తన రూములో కుర్చుంటుంటే, అతడి కొలీగ్ సత్యం మాత్రం పగలబడి నవ్వుతూంటే టి.సి.కి ఎక్కడలేని కోసం వస్తుంది.

"ఏవిటా నవ్వు...?" కోపంగా ప్రశ్నిస్తాడు.

"మిస్టర్ గోపీ! నిన్ను చూస్తోంటే నాకు ఇంకా, ఇంకా నవ్వాలనే వుంది. ఎందుకో చెప్ప చూద్దాం.." సత్యం టి.సి. గోపీ కళ్లల్లోకి చూస్తూ అంటాడు.

"నాకు తెలీదు. ఆ చెప్పేదేదో నువ్వే చెప్ప" సీరియస్‌గా అంటాడు గోపీ.

"ఆ ముసలాయనిచ్చిన ఉపన్యాసంతో ఖంగుతిన్నావ్! రిక్షా కూడా ఏర్పాటు చేసి పంపావ్!! నువ్వేం మనిషివయ్యా బాబూ...!!! అన్నాడు కొలీగ్ సత్యం.

"ఆయనిచ్చింది ఉపన్యాసం కాదు బే! మానవతా విలువల గురించి చెప్పిన సుభాషితాలు. నన్ను మనిషిగా మార్చిన మహామనీషి! నీలాంటివాడు దానికి వక్రభాష్యం చెబితే, నేనేం చేయాలి? అంటూ విసుగ్గా తన డ్యూటీ చార్టులో సంతకం చేసి బయ





## మేజర్ సాబ్ హిట్టేనట!

నేనంటే గిట్టని వారు 'మేజర్ సాబ్' సినిమా ఫ్లాపయిందని దుష్ప్రచారం చేస్తున్నారు తప్ప అది మా ఎ.బి. కార్పొరేషన్ గర్వించదగిన చిత్రం అంటున్నాడు టైటిల్ రోల్ పోషించిన ఆలిండియా సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్. బొంబాయిలో కొందరు కావాలని గొడవ చేస్తున్నారు కాని దేశమంతటా 'మేజర్ సాబ్' విజయవంతంగా నడుస్తోంది అని అమితాబ్ చెప్పాడు. ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాలు తమను కించపరిచేవిగా వున్నాయని కొందరు ఆర్మీ మేజర్లు ఆమధ్య అభ్యంతరం చెప్పారు కూడా. 'మేజర్ సాబ్' చిత్రానికి దీంతో విశేష ప్రచారం లభించింది. పీకల్లోతు కష్టాలలో మునిగిపోయిన అమితాబ్ బచ్చన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఇప్పుడు తన పేరును ఎ.బి. కార్పొరేషన్‌గా మార్చుకుంది. మరి కష్టాలు తీరినట్టేనా?

టకు వెళ్లిపోతున్న టి.సి. గోపీనే రెప్పవాల్చకుండా చూస్తుండి పోయాడు కొలీగ్ సత్యం.

రిక్షావాడికి ఎక్కడికి వెళ్లాలో ముకుందం చెప్పి నట్టుగానే రాజమండ్రి లాంచీ రేవులు దాటి, మార్కండేయ స్వామి గుడి దగ్గరకు రిక్షా వచ్చి ఆగుతుంది. ఖచ్చితంగా తను చేరదల్చుకున్న ప్రదేశానికి సురక్షితంగా చేర్చిన రిక్షా ఆసామీని ముకుందం మెచ్చుకుని పది రూపాయల కాగితం యివ్వబోతాడు. కానీ రిక్షా ఆసామీ సున్నితంగా తిరస్కరిస్తాడు.

రిక్షా దిగిన ముకుందం విప్పారిన నేత్రాలతో పవిత్ర గోదావరిని చూసి నమస్కరిస్తాడు. అప్ప టికి సమయం ఉదయం పది గంటలయింది. కడుపులో ఏదో వికారంగా వున్నట్టు ఫీలయిన ముకుందం, తనలో తనే నవ్వుకుంటాడు. స్నానాల రేవు వద్దకు వెళ్లి స్నానం చేసి, బట్టలు మార్చుకుని తడి బట్టల్ని ఆ ప్రక్కనే ఆరబెట్టి గోదావరి నది మీద నుంచి వచ్చే చల్లని గాలిని హాయిగా అనుభవిస్తాడు. గోదావరికి తనకు ఎంతయినా అనుబంధమున్నది. తను గోదావరి తీర గ్రామంలో జన్మించాడు. బాల్యంలో ప్రతీ నిత్యం రెండు పూటలా ఆ నదీమ తల్లి కౌగిలిలో దోబూచు లాడుకునే దృశ్యం మనోనేత్రంలో కదలాడింది. ఆనాటి రోజులు తలుచుకుంటుంటే ఏదో మధు రానుభూతి పొందుతున్నట్టయింది ముకుందానికి.

స్నానాల రేవులో నుంచి ఒక్కరొక్కరే తమ కార్యక్రమాన్ని ముగించుకుని పోవడం ముకుందం చూస్తూనే గంటన్నర కాలక్షేపం చేస్తాడు. ఆరబెట్టిన దుస్తులు లేత సూర్య కిరణాల వేడితో పొడిగా ఆరడంతో ఆ బట్టలు తీసుకుని బ్రీఫ్‌కేసులో సర్దు కుని, మెల్లగా గట్టుపైకి వచ్చి అక్కడకు దగ్గరగా వున్న అయ్యరు కాఫీ హోటల్‌కు ముకుందం వెళ్లి కుర్చీలో కూర్చుంటాడు. ఓనర్ కమ్ సర్వర్ అయ్యరే అయినందున "ఏం కావాలి అప్పా!" అనంటూ ముకుందాన్ని అడుగుతాడు.

"ఇడ్లీ వేడిగా వుంటే ఓ నాలుగిడ్లీ, కారప్పొడి, నెయ్యి వేసి తీసుకురమ్మనమంటాడు ముకుందం. ముకుందం చెప్పినట్టుగానే అయ్యరు వేడి వేడి ఇడ్లీ ప్లేటు తెచ్చి బల్లమీద పెట్టగానే, ఆవురావు రంటూ లాగించేస్తాడు ముసలాయన. "అయ్యర్ గారూ... ఇడ్లీ చాలా బాగున్నయ్యండీ! మరో రెండు యిడ్లీలు పట్టుకురండి" అనంటాడు ముకుందం. గత రాత్రి నుంచి కడుపులో ఏమీ లేనందున ఆకలి బాగా వేసింది. టిఫిన్ ముగించి స్ట్రాంగ్ కాఫీ తాగి, అయ్యరుకు బిల్లు చెల్లించి బయటపడిన ముకుందం తిన్నగా, మెల్లగా నడు చుకుంటూ లాంచీ రేవు వద్దకు వచ్చి అక్కడున్న మర్రిచెట్టు క్రింద, రేవు మెట్లమీద కూర్చున్నాడు. రేవులో నిలిచిన లాంచీలలో వాణిజ్య సరుకులు ఎగుమతి చేస్తుంటారు కళాసీలు, కూలీలు వగ యిరా. పాపికొండల వైపు వెళ్లే స్టీమరు, యిక్కడ నుంచి బయలుదేరే వేళలు గురించి ముకుందం వాకబుచేసి తెలుసుకున్నాడు. మరునాడుదయం 5 గంటలకు భద్రాచలం వెళ్లేందుకు రెండు లాంచీ లున్నట్టు తెలుసుకున్నాడు. ఈ రాత్రికి ఎక్కడ గడపాలో అర్థం కాలేదు. జేబులోని మనీ పర్సు తీసి ఎంత డబ్బున్నదీ చూసుకుని, తృప్తిగా తిరిగి మనీపర్సు జేబులో పెట్టుకున్నాడు. ఇంతలో ఒకాయన ముకుందం వైపు పరిశీలనగా చూసి, ఎందుకయినా మంచిదని, కూర్చుని ఆలోచిస్తోన్న ముకుందం ప్రక్కకే వచ్చి నిలబడతాడా అపరిచిత వ్యక్తి. ముకుందం కూడా అదే సమయానికి తన దగ్గరే నిలబడిన వ్యక్తి వైపు చూస్తాడు. పరిచయమ యిన మొహంలా వుండి, ఎక్కడ చూశానా అని గుర్తుచేసుకునే ప్రయత్నంలో వున్న సమయంలో, ఆ అపరిచిత వ్యక్తి అనుమానాస్పదంగా ప్రశ్నిస్తాడు.

"ఏమండీ... మీరు ముకుందం గారేనా?"

ముకుందం బిత్తరపోయి, తరువాత తేరుకుని "అవును. మీరు గురుమూర్తి అవునా?" అన్నాడు.

పట్టలేని ఆనందంతో "ఒరేయి ముకుందా?" అనంటూ, ముకుందాన్ని గురుమూర్తి అమాంతంగా వాటేసుకుంటాడు. మిత్రులు పరస్పరం ఒకర్నొకరు బిగియారా కౌగిలించుకుని, స్నేహమేరా తీయనిది" అని రుజువు చేస్తారు.

"మనం విడిపోయి దాదాపు నలభై సంవత్సరాల యిందనుకుంటాను గురుమూర్తీ!" గుర్తుచేసుకున్న వాడిలా ముకుందం ఎంతో ఆనందంగా అంటాడు.

"అవున్రా! నువ్వేమయిపోయావోనని, నీ వివ రాలు తెలుసుకోవాలని ఎంతగానో ప్రయత్నించాము. ఫోన్లే యిప్పటికయినా నిన్ను చూడగలిగామురా ముకుందూ! అబ్బ... నాకెంత ఆనందంగా వుందో చెప్పలేమురా!! ఇంతకీ నువ్వెక్కడ సెటప్ అయి నట్టు? నీ శ్రీమతి, పిల్లలు ఎక్కడున్నారు?? వేగిరం చెప్పరా బాబూ!" అనంటూ తొందరపెడతాడు గురుమూర్తి. కొంతమంది తమవైపే కన్నార్పకుండా చూస్తోండటం గమనించిన ముకుందం పైకి లేచి, ఆ ప్రక్కనే వేపచెట్టు క్రింద ఎవరో దాతలు నిర్మిం చిన సిమ్మెంటు బెంచీని చూసి, గురుమూర్తితో అక్కడకు వెళ్లి సుఖాసీనులవుతారు.

"ఇప్పుడు చెప్పరా నీ విషయాలు" అనంటూ మళ్లీ అడుతాడు గురుమూర్తి.

వాడి ఆతృతను గుర్తించిన ముకుందం పేల వంగా నవ్వి, "ముందు నీ గురించి చెప్పరా గురూ! తర్వాతనే వినిపిస్తాను నా స్వీయ కథ" అనంటాడు ముకుందం. గట్టిగా నిట్టూర్చిన గురుమూర్తి చెప్పడం ప్రారంభించాడు.

"జీవితం వడ్డించిన విస్తరి కాదురా ముకుందూ! నీకు. గతం జ్ఞాపకం వుందో లేదో తెలీదు గానీ, ఓ రోజు నువ్వొచ్చి, విజయనగరం అత్యవసరంగా వెళ్లాలని చెప్పి వెళ్లిపోయిన తరువాత, సిమ్లా నుంచి నాకు టెలిగ్రాం అప్పాయింట్‌మెంట్ ఆర్డర్ వచ్చింది. మంచి ఉద్యోగం. జీతం పదిహేను వందలు. వ్యవధిలేదు. మా అమ్మా - నాన్నల సంతోషానికి అవధుల్లేకపోయాయి. నన్ను బుజ్జ గించి, ప్రయాణం చేయించి సిమ్లా పంపించేశారు. డ్యూటీలో చేరిన వెంటనే నీకు, మా అమ్మా - నాన్నలకు లెటర్సు వ్రాశాను. కానీ మీ నుంచి సమా ధానం లేదు. పదిరోజులు గతించినా మీ ఆచూకీ తెలియకపోవడంతో పిచ్చివాడ్నయిపోయాను. మరి కొద్ది రోజులకు పత్రికల ద్వారా గోదావరి వరదల్లో మన గ్రామం పూర్తిగా తుడిచిపెట్టుకు పోయిం దని తెలుసుకుని మేనేజిమెంటు వారికి చెప్పి నేను మన గ్రామం వచ్చేటప్పటికి ఏముంది? అంతా సర్వనాశనమయింది. గ్రామ జనాభా అయిదువేల మందికి నూటయాభై మంది మాత్రమే సజీవంగా

మిగిలారని తెలుసుకుని భోరున ఏడ్చాను. అమ్మా–నాన్నా, చెల్లెళ్లు, తమ్ముడు అందరూ గోదావరికి బలైపోయారు. నా కుటుంబానికి నేనొక్కడ్నే మిగిలాను" అంటున్న గురుమూర్తి కళ్లల్లో నుంచి కన్నీరు జాలువారుతోంటే ముకుందం ఆ కన్నీరు తుడిచి, ఓదార్చుతాడు.

"బాధ బాధే! జీవితం దోవ జీవితానిదే!! అది దేని కోసం ఆగదు. బంధువర్గమంతా కలసి నన్నో యింటివాడ్ని చేశారు. ఫలితంగా యిద్దర బ్బాయిలు, ముగ్గురమ్మాయిలకు తండ్రినయ్యాను. నిద్రపోతూనే నా భార్య హాయిగా యీ లోకం విడిచి, నన్ను వంటిరివాడ్ని చేసింది. నా పోషణకు నా కొడుకులిద్దరు వాటాలు వేసుకుని పంచుకోవడంతో, నా అభిజాత్యం గాయపడింది. కోడళ్ల సూటీపోటీ మాటలు నన్ను చిత్రవధ చేశాయి. నా ఉనికినే భరించలేని కోడళ్ల దగ్గర తిండి తినడం సహించలేకపోయాను. చెప్పకుండా వచ్చేశాను. ఇక అమ్మాయిలంటావా? నేనంటే ప్రాణం యిస్తారు. నా మూలంగా నా కుమార్తెల దాంపత్య జీవితాలలో వివాదాలు రాకూడదనుకున్నాను. అందరూ వుండి కూడా ఏకాకిగా జీవిస్తున్నాను. నా వంటి అభాగ్యుల్ని ఆదుకోవాలని ఆశ్రమాన్ని నెలకొల్పి, స్వచ్ఛంద సంస్థల సహకారంతో నెట్టుకొస్తున్నాను. ఇదీ నా చరిత్ర!" బరువుగా ముగించిన గురుమూర్తిని ఎంతో సానుభూతిగా, ఆత్మీయంగా చూస్తాడు ముకుందు.

"నా చరిత్ర ఆరంభం నుంచీ నేటి వరకూ అశాంతిగానే జరుగుతోంది. గోదావరి వరదలకు ముందే నాన్నగారికి అనంతపురం జిల్లా ట్రాన్స్‌ఫర్ కావడంతో మా కుటుంబమంతా మన గ్రామాన్ని విడిచిపెట్టడం జరిగింది. ఆవిధంగా గోదావరి నదీమతల్లి వరదల నుంచి బ్రతికి బయటపడటం జరిగింది. పత్రికలలో చూసి మన గ్రామం వచ్చాను. కానీ ఏం లాభం. మీ కుటుంబమంతా నీతో సహా వరదల్లో కొట్టుకుపోయారని తెలుసుకుని ఏడ్చాను. తరువాత నాన్న రిటైరవడం, అందరికీ వివాహాలు చేయడం జరిపించారు. నేను మాత్రం వివాహం చేసుకోనని ఖండితంగా చెప్పడంతో నాకు వివాహం జరగలేదు. అమ్మా–నాన్నా అసంతృప్తిగానే యీ లోకం నుంచి నిష్క్రమించారు. అన్నయ్యలు దుస్వార్థంతో నాకు రావాల్సిన ఆస్థిని కూడా తమ సొంతం చేసుకున్నారు. అక్కయ్యలు కూడా నన్ను వెలివేశారు. కొంత కాలం సినీమా రంగంలోను, మరికొంత కాలం పత్రికా రంగంలోను శ్రమించాను. కానీ అవేవీ నాకు తృప్తినివ్వలేదు. ప్రజాసేవ చేయాలని రాజకీయ రంగంలో ప్రవేశించాను. అది మాయా చదరంగమని, పావులు మార్చి, ప్రజల్ని ఏమార్చి అక్రమ ధనార్జనకు, వ్యక్తిత్వాన్ని బలిపెట్టలేక దాన్నుంచి కూడా బయటపడ్డాను. వయసూ పెరిగింది. వయసుతోబాటు ఆరోగ్యం కూడా చెడింది. .ఆత్మవంచన చేసుకుంటూ యింకా ఎంతకాలం, ఎవరి కోసం బ్రతకాలి? అందుకే ఒక స్థిర నిర్ణయానికి వచ్చాను" అనంటూ ముకుందు యింకా ఏదో చెప్పాలని అనుకుంటున్న సమయంలో గురుమూర్తి వినలేకపోయాడు.

"ఏదిఏమయినా, చిన్నప్పటి నుంచి నీది విలక్షణమయిన వ్యక్తిత్వం. నువ్వు చాలా గొప్పవాడిగా చరిత్ర సృష్టిస్తావని ఆశించేవాడ్ని! నా అంచనా తారుమారయినందుకు విచారిస్తున్నాను. ఇంతకీ నువ్వు తీసుకున్న నిర్ణయం ఏవిటీ?" అనంటూ, కుతూహలంగా ముకుందాన్ని చూస్తాడు.

"మన గ్రామంలో జన్మించాము. నా జన్మభూమిని యీ పవిత్ర గోదావరి దురాక్రమణ చేసి, నిర్దయగా నా ఆత్మీయుల్ని, శ్రేయోభిలాషుల్ని బలి తీసుకుంది. నన్ను మాత్రం ఎందుకు మిగల్చాలి! అందుకే మన గ్రామం వెళ్లి, అక్కడ గోదావరికి నా జీవితాన్ని అంకితం చేసుకుందామని నిర్ణయించామర్రా గురూ!! నిట్టూర్చి, డగ్గుత్తికతో అంటున్న ముకుందం నోటిని తన చేతులతో మూసేసి అంటాడు గురుమూర్తి.

"చాల్లేరా! ఎవరయినా వింటే నిన్ను ఉన్మాదిగా జమకట్టి నవ్వుకుంటారు. విడిపోయిన మనల్ని దైవం కలిపాడు. ఆయుష్షు వున్నంతవరకు శ్రమించి మనవంటి వృద్ధుల్ని ఆదుకుని, మన ఆశ్రమాన్ని నిర్వహిద్దాం!! పద... పద..." అనంటూ ముకుందాన్ని బలవంతంగా లేపి, రిక్షా పిలిచి మిత్రులిద్దరూ రిక్షా ఎక్కుతారు.

